

రంగ్‌దే..! రంగ్‌దే..!

ఉల్లాసంగా... ఉత్సాహంగా... హోలీ



ప్యారీస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వసంత శోభతో ప్రకృతి పులకించే వేళ, చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా శుక్రవారం రాష్ట్రమంతటా హోలీ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. సమాజంలో సఖ్యత పెంచే ఈ పండుగను పేద, ధనిక, చిన్న, పెద్ద అనే భేదం లేకుండా అందరూ ఐకమత్యంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. రాజధాని నగరం చెన్నైలో ఉత్తర భారతీయులు, గుజరాతీలు, మార్వాడీలు, వ్యాపారులు హోలీ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.





శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు

మహిళాభ్యుదయానికి అగ్రతాంబూలం

- పట్టణ ప్రాంతాల్లో రూ.3500 కోట్లతో లక్ష గృహాలు
- రామేశ్వరంలో కొత్త విమానాశ్రయం
- అంతర్జాతీయ స్థాయికి అన్నావర్సిటీ
- నగరాలకు 'బడికి అల్పాహార పథకం' విస్తరణ
- డీఎంకే ప్రభుత్వ పన్నుపోటు రహిత బడ్జెట్

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రజాకర్షక పథకాల ఊసు లేకుండా.. అమలులో ఉన్న పథకాల విస్తరణ, మహిళాభ్యుదయం, మౌలిక సదుపాయాలను పెంపొందించే దిశగా, పన్నుపోటు లేని బడ్జెట్ ప్రవేశ పెట్టారు. పట్టణ ప్రాంతాల్లో 'కలైంజర్ కనవు ఇల్లమ్ పథకం' కింద రూ.3500 కోట్లతో లక్ష గృహాల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించిన విత్తమంత్రి.. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు 18 యేళ్ల దాకా ప్రతినెలా రూ.2వేల ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. బడిపిల్లల అల్పాహార పథకాన్ని నగరాలకు విస్తరింపజేస్తామన్నారు. అన్నాయూనివర్సిటీని ఆసియాలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా రూపొందిస్తామని ప్రకటించారు. అంతేగాక చెన్నై సమీపంలో రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో ఓ కొత్త నగరం నిర్మిస్తామని, రామేశ్వరంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని భావిపౌరులను ఊరించే ప్రయత్నం చేశారు. అయితే మొత్తమ్మీద రూ.41,635 కోట్ల లోటు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

స్టాలిన్ ఆశీస్సులతో..

అసెంబ్లీలో ఉదయం 9.30 గంటలకు బడ్జెట్ చదవడం ప్రారంభించిన ఆర్థికమంత్రి తంగం తెన్నరసు.. 181 తమిళ పేజీల బడ్జెట్ ప్రతిపాదనలను 2 గంటలా 38 నిమిషాలు చదివారు. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ముందు ఆయన మెరీనాబీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణాధి సమాధుల వద్ద నివాళులర్పించారు. ఆ తర్వాత సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను తన బడ్జెట్ రూపకల్పనా బృందం సహా కలిసి ఆయన ఆశీస్సులందుకున్నారు. అనంతరం శాసనసభలో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. నాలుగేళ్ల డీఎంకే పాలనలో స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ దాఖలు చేయడం ఇది నాలుగో సారి కాగా, తంగం తెన్నరసు మూడోసారి దాఖలు చేశారు. తొలిసారి పళనివేల్ త్యాగరాజన్ బడ్జెట్ దాఖలు చేశారు. అయితే సీఎం ఆయన శాఖ మార్చడంతో తంగం తెన్నరసు వరుసగా మూడవసారి బడ్జెట్ దాఖలు చేసినట్లయింది. సభలో ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకే, బీజేపీ సభ్యులు వాకౌట్ చేయడంతో పాలకపక్షం హర్షధ్వానాల నడుమ తంగం తెన్నరసు బడ్జెట్ ప్రసంగం నిరాటంకంగా సాగింది.

(మరిన్ని వివరాలు 7వ పేజీలో...)

ఈడీ అభియోగాలపై న్యాయపరమైన చర్యలు

● మంత్రి సెంథిల్ బాలాజీ

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్న టాస్మాక్ మద్యం దుకాణాల్లో రూ.వెయ్యి కోట్లకుపైగా అవినీతి జరిగిందంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు చేసిన అభియోగాలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీ ప్రకటించారు. ఈ నెల 6వ తేదీ టాస్మాక్ ప్రధాన కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపిన విషయం తెల్సిందే. ఈ తనిఖీలకు సంబంధించి ఈడీ అధికారులు గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీనిపై మంత్రి సెంథిల్ బాలాజీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల టాస్మాక్ ప్రధాన కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో జరిగిన తనిఖీలపై ఈడీ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో స్పష్టత లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సెంథిల్ బాలాజీ

అంతేకాకుండా మూతపడిన టాస్మాక్ దుకాణాల్లో పనిచేసిన 2,157 మంది సిబ్బందికి 2023లో ఇతర ప్రాంతాలకు బదిలీ చేసామన్నారు. ఇవన్నీ న్యాయబద్ధంగా జరిగాయని పేర్కొన్నారు. రవాణా ఒప్పందాల్లో ఫిబ్రవరి 2023లో ఆహ్వానించిన టెండర్లలో అతి తక్కువ ధరకు కోడ్ చేసిన సంస్థలకే అప్పగించడం జరిగిందన్నారు. ఇందులో కేవైసీతో పాటు బ్యాంకు వివరాలన్నీ పక్కాగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ రవాణా ఒప్పందాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. అయితే, కొన్ని రవాణా ఒప్పందాలకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నం కావడంతో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టాస్మాక్ దుకాణాల నగదు లావాదేవీల్లో ప్రతి ఒక్కటీ పారదర్శకంగా జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో టాస్మాక్ దుకాణాల్లో వెయ్యి కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఈడీ అధికారులు చేసిన ప్రకటనల సత్యదూరమన్నారు. దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సెంథిల్ బాలాజీ పేర్కొన్నారు.

టాస్మాక్ అధికారులకు సమన్లు!

టాస్మాక్ దుకాణాల్లో అవినీతి జరిగినట్టు ఈడీ అధికారుల తనిఖీల్లో తేలింది. దీనికి సంబంధించి పలువురు టాస్మాక్ ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేసి, విచారణ జరపాలని అధికారులు భావిస్తున్నారు. ఈ అవినీతిలో అధికారుల పాత్ర ఉన్నట్టు తేలితే సంబంధింత అధికారులను అరెస్టు చేసే అవకాశం ఉందని ఈడీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏప్రిల్ 30 వరకు శాసనసభ సమావేశాలు

స్పీకర్ అప్పావు



పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు వచ్చే నెల 30వ తేదీ వరకు జరుగుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు బడ్జెట్ దాఖలు చేసిన అనంతరం స్పీకర్ నేతృత్వంలోని అసెంబ్లీ వ్యవహారాల కమిటీ శుక్రవారం మధ్యాహ్నం భేటీ అయి సమావేశాలు ఎన్నిరోజులు జరపాలన్న దానిపై చర్చించింది. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వ తేది వరకు శాసనసభ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లపై 17వ తేది నుంచి నాలుగు రోజుల పాటు చర్చ జరుగుతుందని, అనంతరం 21వ తేది నుంచి బడ్జెట్‌పై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానాలు ఇస్తారని తెలిపారు. ప్రతిరోజూ తొలుత ప్రశ్నోత్తరాల సమయం కేటాయించనున్నామని, వివిధ శాఖల పద్దులపై చర్చ జరుగుతుందన్నారు. తాము మాట్లాడేందుకు అధిక సమయం కేటాయించడం లేదని ఆరోపిస్తూ, అన్నాడీఎంకే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనుందని, అయితే ఇదేమీ కొత్త కాదన్నారు. అన్నాడీఎంకే ఆరోపణలకు ఇప్పటికే సమాధానమిచ్చామని స్పీకర్ అప్పావు తెలిపారు.

కేరళ సీఎంతో మంత్రి త్యాగరాజన్ భేటీ

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను రాష్ట్ర మంత్రి పీటీ త్యాగరాజన్, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్‌లు శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ఏర్పడే ఇబ్బందులపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఇటీవల అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో సమన్వయ కమిటీ ఏర్పాటుచేయాలని తీర్మానించారు. అందులో భాగంగా నగరంలో ఈ నెల 22న దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అధికార, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అందులో భాగంగా కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను డీఎంకే తరఫున మంత్రి త్యాగరాజన్ కలుసుకొని, సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించారు.



కేరళ సీఎం పినరయి విజయన్‌ను కలుసుకున్న మంత్రి త్యాగరాజన్, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్

చెన్నైలో ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నిర్మాత ఏఎం రత్నం

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చెన్నై నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. షోళింగనల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ వేడుకలను జరిగాయి. జనసేన పార్టీ చెన్నై విభాగం కన్వీనర్ తమ్మయ్య నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ సినీ నిర్మాత ఏఎం.రత్నం, ప్రత్యేక అతిథిగా సినీ నటుడు సప్తగిరి పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న ముఖ్య నేతలు జనసేన సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రముఖ డబ్బింగ్ కళాకారుడు నారాయణబాబు వ్యవహరించారు. ఈ ఆవిర్భావ వేడుకలు ఘనంగా ముగియడంతో ముఖ్య అతిథులు, కన్వీనర్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం): 6.26
సహర్ (ఆదివారం): 4.35

మా పథకాలకు కొత్త పేర్లు

అచరణకు సాధ్యం కాని ప్రకటనలతో సరి ● ఈపీఎస్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ప్యారీస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అచరణకు సాధ్యం కాని ప్రకటనలతో బడ్జెట్ అంతా మోసపూరితంగా వుందని, గతంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకే కొత్తగా పేర్లు పెట్టి మసిపూసి మారేడుకాయ చేశారని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. అసెంబ్లీలో శుక్రవారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ బయట ఎడప్పాడి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి తంగం తెన్నరసు ఆచరణకు సాధ్యం కాని ప్రకటనలతో మాత్రమే బడ్జెట్ సరిపెట్టారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ 95శాతం హామీలను నెరవేర్చినట్లు ప్రకటించారని, అయితే 40శాతం హామీలు ఇంకా అలాగే వున్నాయని విమర్శించారు. నీట్ రద్దు చేస్తామని, అందుకు సంబంధించిన రహస్యం తమ వద్ద వుందని పలు వేదికలపై ప్రకటించిన ఉపముఖ్యమంత్రి ఉదయనిధి తన మాట నిలబెట్టుకోకుండా విద్యార్థులకు ద్రోహం తలపెట్టారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులుగా పెంచుతామన్న హామీ ఏమైందని ఈపీఎస్ ప్రశ్నించారు.

పెరిగిన రుణభారం...

గత 73ఏళ్ళలో రాష్ట్రప్రభుత్వం పొందిన అప్పు రూ.5లక్షల 18వేల కోట్లు మాత్రమేనని అయితే, డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్ళలో రూ.3లక్షల 54వేల కోట్లు రుణం పొందిందని, దేశంలోనే అధిక రుణాలు పొందే రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని ఈపీఎస్ ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో కొత్త పథకాలంటూ ఏమీ లేవన్నారు.

ప్రజలను విస్మరించిన బడ్జెట్ టీవీకే నేత విజయ్

రాష్ట్రప్రజలను విస్మరించే విధంగా డీఎంకే ప్రభుత్వ బడ్జెట్ ఉందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ విమర్శించారు. కేవలం ప్రకటనలపైనే శ్రద్ధ చూపుతున్న డీఎంకే మోడల్ ప్రభుత్వం రహదారుల స్థితిగతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై బడ్జెట్‌లో ప్రకటించలేదన్నారు. కళాశాల విద్యార్థులకు మాత్రమే లాప్‌టాప్‌లు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం, ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థుల గురించి ప్రస్తావించలేదన్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునే విధంగా ఈ బడ్జెట్ వుందని విజయ్ వ్యాఖ్యానించారు.

ఇది ఎన్నికల బడ్జెట్... కేంద్రమంత్రి ఎల్.మురుగన్

కేంద్రప్రభుత్వం నిధులిచ్చే పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ తన తండ్రి కరుణానిధి పేరు పెట్టినంత మాత్రాన అది డీఎంకే సాధించిన విజయమవుతుందా? అని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ విమర్శించారు. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2026లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అవకాశం లేనందున మధ్యంతర బడ్జెట్‌ను మాత్రమే ఈ డీఎంకే ప్రభుత్వం దాఖలు చేస్తుందని, అందువల్ల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందానే ఏకైక దృష్టితోనే ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. ఈ నాలుగేళ్ళలో 57వేలకు పైగా పోస్టులను భర్తీచేసినట్లు బడ్జెటలో ప్రకటించిన ప్రభుత్వం వచ్చే సంవత్సరం 40వేల ప్రభుత్వ పోస్టులను ఎలా భర్తీ చేస్తుందన్న వివరాలు బడ్జెట్‌లో లేవని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ అన్నారు.

పసలేని బడ్జెట్ బీజేపీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్

డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కొత్తగా అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి లేవని, ఇదో పసలేని బడ్జెట్ అని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్ వ్యాఖ్యానించారు. టాస్మాక్ సంస్థలో ఇటీవల తనిఖీలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అందులో రూ.వెయ్యి కోట్ల మేర అవినీతి జరిగిందంటూ గురువారం ప్రకటించారని, అయితే ఎలాంటి అవినీతి జరగలేదని మంత్రి సెంథిల్ బాలాజీ చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఈ అవినీతి గురించి చర్చించేందుకు అసెంబ్లీలో తమకు అవకాశం కల్పించాలంటూ స్పీకర్ అప్పావు వద్ద సావధాన తీర్మానంకు సంబంధించి వినతిపత్రాన్ని తమ పార్టీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సమర్పించారని నాగేంద్రన్ తెలిపారు.

అన్నాడీఎంకే - బీజేపీ వాకౌట్...

రాష్ట్ర వార్షిక ఆర్థిక బడ్జెట్‌ను బహిష్కరించిన అన్నాడీఎంకే - బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుండి వాకౌట్ చేశారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు స్పీకర్ అప్పావు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్థిక శాఖామంత్రి తంగం తెన్నరసు 2025-26వ సంవత్సరానికి సంబంధించి వార్షిక బడ్జెట్‌ను దాఖలు చేసి, అందులోని అంశాలను చదవడం ప్రారంభించారు. అప్పుడు సభలో లేచి నిలబడిన ప్రతిపక్షనేత ఆర్బీ ఉదయ్‌కుమార్ స్పీకర్‌కు వ్యతిరేకంగా అన్నాడీఎంకే తరఫున ప్రవేశపెట్టాలనుకున్న అవిశ్వాస తీర్మానంపై మాట్లాడేందుకు యత్నించారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన స్పీకర్ అప్పావు.. మైక్ కట్ చేయించారు. దీనిని ఖండిస్తూ.. అన్నాడీఎంకే సభ్యులు ఎడప్పాడి పళనిస్వామి అధ్యక్షతన సభనుండి వాకౌట్ చేశారు. వారితో పాటు స్పీకర్ చర్యలను ఖండిస్తూ, బీజేపీ సభ్యులు కూడా వాకౌట్ చేశారు. అయితే అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓ.పన్నీర్ సెల్వం, ఆయన మద్దతుదారులు మాత్రం సభలోనే కూర్చుండిపోయారు.

సమాచార దర్శిని

పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గురువారం ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు https://tnpoly.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, పార్ట్ టైం కోర్సులు చేయదలచిన టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలి. ప్లస్ టూ పూర్తయిన విద్యార్థులు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం, రెండేళ్ల ఐటీఐ ముగించిన విద్యార్థులు రెండవ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులని మంత్రి తెలిపారు.

కొత్త వేతనం నిర్ణయంపై కమిటీ

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బోర్డు ఉద్యోగులకు 2023 డిసెంబరు నుంచి కొత్త వేతనాల చెల్లింపు విషయమై 8 మందితో కూడిన కమిటీని విద్యుత్ బోర్డు నియమించింది. రాష్ట్ర విద్యుత్ బోర్డులో సుమారు 80వేల మంది పనిచేస్తున్నారు. వారికి నాలుగేళ్లకు ఒకసారి వేతన పెంపు అమలవుతోంది. ఆ ప్రకారం, 2023 డిసెంబరు 1 నుంచి కొత్త వేతనం నిర్ణయించాల్సి ఉంది. కొత్త వేతనం నిర్ణయంపై చర్యలు జరపాలని విద్యుత్ బోర్డు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కొత్త వేతనం నిర్ణయంపై కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు 8 మందితో కూడిన కమిటీని నియమిస్తూ విద్యుత్ బోర్డు ఛైర్మెన్ రాధాకృష్ణన్ ఉత్తర్వులు జారీచేశారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో ఉచితంగా హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయమై రవాణా శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. రోడ్డు రవాణా సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ ఇవ్వనున్నాయి. గుమ్మిడిపూండి, విల్లుపురం, వేలూరు, తిరుచ్చి, కుంభకోణం, కారైక్కుడి, పుదుకోట, సేలం, ధర్మపురి, పొల్లాచ్చి, ఈరోడ్, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, మదురై, దిండుగల్, విరుదునగర్ తదితర 16 కేంద్రాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. 20 ఏళ్లు నిండి లైట్ వెహికల్ లైసెన్స్ పొంది ఏడాది పూర్తయిన వారు శిక్షణ ఇచ్చేందుకు చేరవచ్చు ఆసక్తి కలిగిన వారు https://candidate.tnskill.tn.gov.in/skillwallet/ అనే వెబ్‌సైట్‌లో 'ఆటోమోటివ్' అనే విభాగంలో 'కమర్షియల్ డ్రైవర్ ట్రైనింగ్ లెవల్ 4' అనే కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.20వేల కోట్ల ఆదాయం

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ ద్వారా రూ.20వేల కోట్ల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 33.3 లక్షల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.18,800 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈ నెల 13వ తేది వరకు 32 లక్షల పత్రాల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.20వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుకు ఇంకా 15 రోజులు అవకాశముండడంతో ఆదాయం మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఐపీఎల్ టిక్కెట్ల పేరిట 'నకిలీ లింక్'

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాల పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ లింక్‌లు పంపుతున్నారని, ఇలాంటి వాటిపై క్రికెట్ అభిమానులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ హెచ్చరించింది. ఐపీఎల్ 18వ సీజన్ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఐపీఎల్ పోటీల టిక్కెట్ల విక్రయాలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, సామాజిక మాధ్యమాల్లో 'బుక్ యువర్ టికెట్ నౌ' అంటూ నకిలీ లింక్ వస్తోంది. ఈ లింక్‌లు నమ్మిన పలువురు అభిమానులు నగదు కోల్పోయినట్లు ఫిర్యాదులందుతున్నాయి. ఈ విషయమై గ్రేటర్ చెన్నై పోలీస్ కార్యాలయం విడుద చేసిన ప్రకటనలో... ఐపీఎల్ పోటీలకు సంబంధించి టిక్కెట్ల విక్రయాలపై ఇంకా ప్రకటన రాలేదని, అయితే సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాలను అభిమానులు నమ్మరాదని, తమ మొబైల్‌కు ఐపీఎల్ టిక్కెట్ల పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయరాదని పోలీసు శాఖ హెచ్చరించింది.

టాస్మాక్‌లో అవినీతికి నిరసనగా 17న బీజేపీ ధర్నా

టి.నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ సంస్థలో రూ.1000 కోట్ల మేర జరిగిన అవినీతి అక్రమాలను ఖండిస్తూ ఈ నెల 17న ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. ప్రభుత్వ సంస్థల్లో ఈడీ చేస్తున్న దాడుల వైపు ప్రజలు దృష్టిసారించకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్బంధ హిందీ, జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలను ఉద్యమాల వైపు ప్రేరేపిస్తున్నారని ఆయన ఆరోపించారు. టాస్మాక్ సంస్థ రూ.1000 కోట్ల మేరకు అవినీతికి పాల్పడినట్లు ఈడీ అధికారులే అధికారికంగా ప్రకటించారని, దీనికి బాధ్యత వహించి ముఖ్యమంత్రి స్టాలిన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ శాఖగా ఈడీ

● ఎంపీ కనిమొళి ధ్వజం

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ శాఖగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పనిచేస్తోందని డీఎంకే ఎంపీ కనిమొళి ఆరోపించారు. టాస్మాక్ ప్రధాన కార్యాలయం, డిస్టిలరీ కంపెనీలు, మాజీ అధికారుల ఇళ్లల్లో ఇటీవల మూడు రోజులు తనిఖీలు చేపట్టిన ఈడీ, టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, నగరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కనిమొళిని టాస్మాక్ అవినీతిపై విలేఖరులు ప్రశ్నించారు. అందుకు ఆమె బదులిస్తూ... ఈడీ ఏ విధంగా పనిచేస్తోంది అనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు. బీజేపీ రహిత రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ శాఖలా ఈడీ పనిచేస్తోందని ఎంపీ కనిమొళి ఆరోపించారు.

నేతల సమక్షంలో కలెక్టర్ ఈవీఎంల పరిశీలన

వేలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లోవున్న ఈవీఎంలను కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో వేలూరు కార్పొరేషన్ కమిషనర్ జానకి, సత్యమూర్తి,డీఎంకే, అన్నాడీఎంకే నాయకులు పాల్గొన్నారు.

మాతృభాషను మరువొద్దు

ఎస్కేడీటీ వార్షికోత్సవంలో డాక్టర్ సీఎంకే రెడ్డి


విద్యార్థులకు బహుమతులందజేస్తున్న సీఎంకే రెడ్డి, శోభారాజా తదితరులు

ప్యారీస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బ్రతుకు దెరువుకోసం ఎన్ని భాషలనైనా నేర్చుకోండి కానీ, మాతృభాషను మాత్రం మరవద్దని అఖిల భారత తెలుగు సమాఖ్య, కనక దుర్గ తెలుగు పాఠశాల (ఎస్కేడీటీ) అధ్యక్షులు డాక్టర్ సీఎంకే రెడ్డి పిలుపునిచ్చారు. విల్లివాక్కంలోని ఎస్కేడీటీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఎస్కేడీటీ తెలుగు ప్రాథమిక పాఠశాల 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి విస్తాలి శంకర్‌రావు, ప్రత్యేక అతిథులుగా ఐటీపీఎల్ డైరెక్టర్ శోభారాజా, కాంగ్రెస్ ప్రముఖులు తాళ్లూరి సురేష్, పాఠశాలల ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహకులు డాక్టర్ సీఎం కిషోర్ పాల్గొని పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లయన్ జనక కోటయ్యతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పోరూరు శ్రీనివాసరావు, ఎన్.నరసింహులు, శేషగిరిరావు, కామేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌నాయుడు, ఎస్.రేణుక తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ అందజేస్తున్న పోలీస్ కమిషనర్ అరుణ్

ట్రాఫిక్ పోలీసులకు టోపీ, మజ్జిగ పంపిణీ

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, మజ్జిగ, శీతల పానీయాలందించే కార్యక్రమాన్ని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ శుక్రవారం ప్రారంభించారు. వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ అరుణ్ పాల్గొని, ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి 'పిత్ హీట్' పేరుతో రూపొందించిన కాగితపు టోపీలు, మజ్జిగ అందజేశారు. రోజుకు ఒక మజ్జిగ ప్యాకెట్ రూ.6.33 చొప్పున 4,864 ప్యాకెట్లకు రూ.30,789 మొత్తం 120 రోజులు జరిగే ఈ కార్యక్రమానికి రూ.37,56,273 ఖర్చు చేయనున్నట్లు పోలీసు కమిషనర్ కార్యాలయ ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్ నదిలో చెత్త వేయకుండా నిషేధించండి

● స్థానిక సంస్థలకు విమానాశ్రయ అధికారుల లేఖ

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం సమీపంలో అడయార్ నది ప్రవహిస్తోంది.ఈనదితీరాల్లో చెత్త,మాంసపు వ్యర్థాలు తదితరాలు పారబోస్తున్నారు. ముఖ్యంగా, అడయార్ నది ప్రవహించే పొలిచ్చలూరు,కౌల్‌బజార్, కోళపాక్కం,కెరుగంబాక్కం,మనపాక్కం ప్రాంతాల్లో డంపింగ్ అధికంగా ఉంటోంది. దీంతో, ఆ ప్రాంతాల్లో పక్షులు ఎగురడంతో విమానాల ల్యాండింగ్‌కు అంతరాయం కలుగుతోంది.విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న అడయార్ నది ఒడ్డున చెత్త వేయకుండా నిరోధించేలా, వేసిన చెత్తను సత్వరం తొలగించాలంటూ గ్రేటర్‌చెన్నై కార్పొరేషన్(జీసీసీ)పరిధిలోని ఆలందూర్ మండలం, సెయింట్ థామస్ మౌంట్ కంటోన్మెంట్, కుండ్రత్తూర్, సెయింట్‌థామస్‌మౌంట్ యూనియన్ కార్యాలయాలకు విమానాశ్రయ అధికారులు లేఖలు రాశారు.

టీవీకేలో మరో 19 మంది జిల్లా కార్యదర్శుల నియామకం

టి.నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ పరంగా రాష్ట్రమంతటా 121 జిల్లా శాఖలను ఏర్పాటు చేసి కార్యదర్శులను నియమిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 234 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. చిన్న నియోజకవర్గాలయితే రెండు నియోజకవర్గాలకు ఓ జిల్లా కార్యదర్శి, పెద్ద నియోజకవర్గాలయితే ఓ నియోజకవర్గానికి ఓ జిల్లా కార్యదర్శి చొప్పున నియమించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయన ఐదు విడతలుగా 95 జిల్లాలకు జిల్లా కార్యదర్శులను నియమించి, పార్టీ ప్రధాన కార్యాలయానికి వారిని పిలిపించి నియామక పత్రాలు కూడా అందజేశారు. తాజాగా 19 జిల్లాలకు కొత్త కార్యదర్శులను నియమించారు.

పేరుకే రైతుల గ్రీవెన్స్...!

● సెల్‌ఫోన్‌లతో అధికారుల బిజీ


సమావేశంలో సెల్‌ఫోన్లలో అధికారులు

తిరుత్తణి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రైతుల గ్రీవెన్స్ జరిగింది. రెవెన్యూ డివిజనల్ కమిషనర్ దీప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్, అటవీ, పోలీసు, ప్రజాపనుల శాఖల అధికారులు పాల్గొనగా, జాతీయ శాఖ అధికారులు గైర్హాజయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి పనులను సక్రమంగా పర్యవేక్షణ సహా పలు సమస్యలను రైతులు తెలియజేశారు. రైతులు తమ సమస్యలు తెలుపుతున్నా పలు శాఖల అధికారులు ఆ సమస్యలు తెలుసుకోకుండా తమ సెల్‌ఫోన్లలో బిజీగా మారిపోయారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నా, అధికారుల్లో మార్పులు రాలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అగ్నిప్రమాదం

● పరుగులు తీసిన రోగులు, సిబ్బంది


ఆసుపత్రి వద్ద గుమిగూడిన రోగులు, బంధువులు

తిరుత్తణి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం హఠాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించడం కలకలం రేపింది. ఈ ఆసుపత్రిలో సుమారు 100 మంది ఇన్‌పేషంట్లుగా ఉండగా, ప్రసూతి వార్డులో 70 మంది మహిళలు ఉన్నారు. ఈ క్రమంలో, శుక్రవారం ఉదయం మందులు ఉంచిన రెఫ్రిజిరేటర్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో, ప్రసూతి వార్డులో ఉన్న గర్భిణులు, బాలింతలు పసికందులను తీసుకొని బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న తిరుత్తణి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకపోవడంతో ఆసుపత్రి నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

కాట్పాడిలో తుపాకీ కాల్పులు

● ఒకరికి తీవ్రగాయాలు

వేలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని కాట్పాడి గాంధీనగర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు గొడవల కారణంగా శుక్రవారం తుపాకీలతో పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని అక్కడి స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

సీపీఎం జాతీయ మహాసభల ప్రచార జాతా ప్రారంభం


కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షణ్ముగం తదితరులు

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 24వ జాతీయ మహాసభలు ఏప్రిల్ 2 నుంచి 6వ తేది వరకు మదురైలో జరుగనున్నాయి. కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా టి.నగర్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ జాతీయ మహాసభల సందర్భంగా ప్రచార జాత ప్రారంభిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.బద్రి, సీనియర్ నేత టీకే రంగరాజన్, కేంద్ర కమిటీ సభ్యులు పి.సంపత్, సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ముగనయినార్, వి.రాజశేఖరన్, చింతన్, కేసీ గోపికుమార్, విల్సన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ కుటుంబం బలవన్మరణం కేసు

ఫైనాన్షియర్ కోసం పోలీసుల గాలింపు

టి.నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమంగళం ప్రాంతానికి చెందిన డాక్టర్ బాలమురుగన్ కుటుంబం ఆత్మహత్యకు అప్పులిచ్చిన ఫైనాన్షియర్ల వేధింపులు కారణమై ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న వెట్రి అనే ఫైనాన్షియర్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అన్నానగర్ సమీపం తిరుమంగళం వద్ద భవనసముదాయంలో నివసిస్తున్న డాక్టర్ బాలమురుగన్ (53), ఆయన భార్య సుమతి (47), వీరి కుమారులు జస్వంత్‌కుమార్ (18), లింగేష్ కుమార్ (16) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి డాక్టర్ బాలమురుగన్ ప్లాట్ పక్కనే నివసిస్తున్నవారిని, బంధువుల ను పోలీసులు విచారణ జరిపారు. అదే సమయంలో ఆయన ఇంటిలో ఉన్న ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని గత వారం రోజులుగా ఎవరెవరు కాల్ చేశారనే విషయంగా ఆరా తీస్తున్నారు. పోలీసులకు బాలమురుగన్ నివాసంలో నలుగురి పేర్లతో ఉన్న చెక్కులు లభించాయి. ఆ చెక్కులపై పేర్లున్న వారిని కూడా పోలీసులు విచారణ జరిపేందుకు సిద్ధమవుతున్నారు. బాలమురుగన్ నడుపుతున్న రెండు స్కానింగ్ సెంటర్ల సిబ్బందిని కూడా పోలీసులు విచారణ జరపగా ఉద్యోగులను కన్నబిడ్డల్లా చూసుకునేవారని తెలిపారు. స్కాన్ సెంటర్ల విస్తరణకు చేసిన రూ.5 కోట్ల రుణానికి ప్రతినెలా విధిగా వాయిదాలు చెల్లిస్తుండేవారని, అయితే స్కానింగ్ సెంటర్ల ద్వారా ఆదాయం లేక దిగులు చెందారని పోలీసులు విచారణలో వెల్లడైంది. అదే సమయంలో పోలీసులు ఈ కేసుకు సంబంధించిన శివకుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభుకు ఘన సన్మానం


సురేష్ ప్రభుతో కార్యక్రమ నిర్వాహకులు

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభును మాల్ బలాద్ ఫ్యామిలీ, టీమ్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఘనంగా సన్మానించింది. నగరంలోని ఒక నక్షత్ర హోటల్ జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి మద్రాస్ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ ఆర్.శంకర్‌నారాయణన్, సీనియర్ కౌన్సిల్ జయేష్ డోలియా ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. దేశానికి చేసిన విశేష కృషిగాను ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ ప్రభు మాట్లాడుతూ తాను కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో దేశంలో విద్యుత్ సమస్యను ఎదుర్కొనేందుకు చేసిన విశేష కృషిని వివరిస్తూ, సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో తెలియడం లేదన్నారు. పలు విద్యుత్ ప్రాజెక్టులపై సంతకం చేయడంతో పాటు సహా కీలక ప్రాజెక్టులను నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు (ఆంధ్రప్రదేశ్), జయలలిత (తమిళనాడు) దక్కించుకున్నారన్నారు. తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. విదేశాలకు వెళ్ళేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్టు తెలిపారు.

కేంద్రం ఇచ్చే నిధులను మేమే సమకూరుస్తాం

● ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించకపోవడంతో కేంద్రం ఇవ్వాల్సిన నిధులను నిలిపివేసిందని, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు వెల్లడించారు. ఆయన శుక్రవారం 2025-26 సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... కొత్త జాతీయ విద్యా విధానానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.2152 కోట్లను విడుదల చేయలేదన్నారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన ప్రకటించారు. కేంద్రం నిధులివ్వకపోయినా సరే రాష్ట్రంలో ద్విభాషా విద్యా విధానానికే తమ ప్రభుత్వం కట్టుబడివుంటుందని మంత్రి తంగం తెన్నరసు స్పష్టం చేశారు.

ఇకనైనా కేంద్రం సిగ్గుపడి నిధులు విడుదల చేసేనా?

● కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద కేంద్రం విడుదల చేయాల్సిన రూ.2152 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చనుండటం హర్షణీయమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం అన్నారు. రాష్ట్రంలో ఏడేళ్లుగా సమర్థవంతంగా అమలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ పథకానికి ఈ యేడాది కేంద్రం నిధులివ్వకపోయినా విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఆ నిధులను తామే ఇస్తామని ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు బడ్జెట్ ప్రతిపాదనలలో ప్రకటించడం స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వ హుందాతనాన్ని వ్యక్తపరుస్తోందని చిదంబరం అన్నారు. త్రిభాషా విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్న కారణంగా సమగ్ర శిక్షా అభియాన్ పథకం ప్రకారం చెల్లించాల్సిన నిధులను విడుదల చేసే ప్రసక్తి లేదని కేంద్రం ప్రకటించడం గర్హనీయమని తెలిపారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సిగ్గుతో ఆ నిధులను విడుదల చేస్తుందని తాను భావిస్తున్నాని ఆయన చెప్పారు.

ఖైదీలు తయారు చేసిన వస్తువుల విక్రయాల్లో

నకిలీ బిల్లులతో మోసం

● మహిళా ఎస్పీ సహా ముగ్గురి సస్పెన్షన్

వాషర్‌మెన్‌పేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మదురై జైల్లో ఖైదీలు తయారుచేసిన వస్తువుల విక్రయాలపై జరిగిన మోసం వ్యవహారంలో మహిళా ఎస్పీ, ఏడీఎస్పీ సహా ముగ్గురిపై సస్పెన్షన్ వేటుపడింది. మదురై జైలులో ఖైదీలు తయారుచేసిన వస్తువులు కోర్టులు, ప్రభుత్వాస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటారు. ఈ వస్తువులు ప్రైవేటు సంస్థలు కొనుగోలు చేసిన సమయంలో అదనపు ధరకు, ప్రభుత్వ కార్యాలయాలకు తక్కువ ధరకు విక్రయించారని ఆరోపణలున్నాయి. అలాగే, నకిలీ బిల్లుల ద్వారా 2016 నుంచి 2021 వరకు సుమారు రూ.1.63 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని అప్పట్లో పనిచేసిన మదురై జైలు ఎస్పీ ఊర్మిళ, పాళయంకోట ఏడీఎస్పీ వసంతకన్నన్, వేలూరు జైలు నిర్వహణ అధికారి త్యాగరాజన్, వ్యాపారులు సహా 11 మందిపై కేసు నమోదుచేశారు. ప్రస్తుతం పుదుకోట సెంట్రల్ జైలు ఎస్పీగా పనిచేస్తున్న ఊర్మిళ, వసంతకన్నన్, త్యాగరాజన్‌లను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

కొడవళ్లు, కత్తుల వర్క్‌షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

● పోలీసు శాఖ ఆదేశం



పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కత్తులు, కొడవళ్లు, సుత్తి తదితర వస్తువులు తయారుచేసే వర్క్ షాపుల్లో సీసీ కెమెరాలు విధిగా అమర్చాలని పోలీసు శాఖ ఆదేశించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ, నగర పోలీసు కమిషనర్లకు జారీచేసిన ఉత్తర్వుల్లో... హత్యలు సహా పలు నేరాలకు పాల్పడుతున్న రౌడీలకు కత్తులు, కొడవళ్లు తదితర ఆయుధాలు లభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం పోలీసుస్టేషన్ల పరిధిలో కత్తి సహా ఆయుధాలు తయారీ వర్క్ షాప్ యజమానుల సెల్‌ఫోన్లు నెంబర్లు సేకరించాలన్నారు. ఎన్ని ప్రాంతాల్లో ఆయుధాల తయారీ వర్క్ షాప్‌లున్నాయని గుర్తించాలన్నారు. వ్యవసాయం, ఇంటి వినియోగం కోసం కొడవళ్లు తదితరాలు కొనుగోలు చేస్తున్నట్లు వర్క్ షాప్ యజమానులు ధ్రువీకరించుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కత్తులు, కొడవళ్లు కొనుగోలు చేస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని సూచించాలన్నారు. అలాగే, ఆయుధాల తయారీ వర్క్‌షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని తెలియజేయడంతో పాటు పర్యవేక్షించాలని పోలీసు శాఖ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

ఎమ్మెల్యే జవాహిరుల్లాకు ఏడాది జైలు

● సమర్థించిన హైకోర్టు


ఎమ్మెల్యే జవాహిరుల్లా

పెరంబూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి చట్టవిరుద్ధంగా రూ.1.55 కోట్లు పొందారనే కేసులో మనిద నేయ మక్కల్ కట్చి ఎమ్మెల్యే జవాహిరుల్లాకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఎగ్మూర్ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే తరఫున మద్రాసు హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ అప్పీలు పిటిషన్ విచారించిన హైకోర్టు.. జవాహిరుల్లా జైలుశిక్షను సమర్థిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో, ప్రస్తుతం రంజాన్ ఉపవాస దీక్షలు కావడంతో ఉత్తర్వులు నిలిపివేయాలని జవాహిరుల్లా అభ్యర్థన పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం, నెలరోజుల పాటు తీర్పును నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

కోళ్ళ పెంపకంపై ఖైదీలకు శిక్షణ


ఖైదీలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న జైలు అధికారులు

వేలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వెటర్నిటీ యూనివర్సిటీ, రీసెర్చ్ కేంద్రం, మాజీ జైలు ఖైదీల ఆదరణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వేలూరు సెంట్రల్ జైలులో వున్న ఖైదీలకు నాటుకోళ్ళ పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు జైలు శాఖ ఉపాధ్యక్షుడు షణ్ముగ సుందరం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జైలు సూపరిండెంట్ ధర్మరాజ్ మాట్లాడుతూ అందరూ తెలిసీ తెలియని తప్పులు చేస్తుంటాం! ఆ తప్పుకు శిక్ష పొంది జైలుకి వస్తుంటారు. తమ తప్పు తెలుసుకుని మార్పు వచ్చి సమాజంలో బాధ్యతగా మెలగాలని, ఈ కోళ్ళ పెంపకంపై శిక్షణపొంది వృత్తి పరంగా అభివృద్ధిపొందాలని ఆయన ఖైదీలకు సూచించారు. అనంతరం కోళ్ళ పెంపకంపై శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లు అందించారు. జైలు ఖైదీల ఆదరణ సంఘ సభ్యులు, రీసెర్చ్ కేంద్ర జాయింట్ లెక్చరర్ డాక్టర్ పాండియన్, జైళ్ల సంక్షేమ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ స్మగ్లర్ అరెస్టు

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి విమానంలో చెన్నైకు మత్తుపదార్థాలను అక్రమంగా తరలిస్తూ, కొంతకాలంగా పట్టుబడకుండా తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన స్మగ్లర్‌ను ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేశారు. కొలంబో నుంచి చెన్నైకి ఓ విమానంలో వచ్చిన ప్రయాణికులను భద్రత, కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. వారి పాస్‌పోర్టులను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిశితంగా పరిశీలించగా, డ్రగ్ స్మగ్లర్‌గా గుర్తింపు పొంది కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా సంచరిస్తున్న ప్రధాన స్మగ్లర్ తిరుచ్చికి చెందిన మహ్మద్ ముష్పిన్ (23) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ స్మగ్లర్‌ను గత రెండేళ్ళుగా తిరుచ్చి నేర విభాగం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రజా వినతులపై అధికారుల సమీక్ష

వేలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలో 'ముఖ్యమంత్రి కాక్కుమ్ కరంగల్' పథకం కోసం ప్రజల నుంచి తీసుకున్న వినతిపత్రాలపై ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) శాఖ సెక్రటరీ సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ సజ్జన్ సింగ్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మీ తదితర అధికారులతో శుక్రవారం ఉదయం సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో మొత్తం 115 వినతిపత్రాలు అందినవని, వీటిపై త్వరలోనే తగిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ సుబ్బులక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ రమణి, వేలూరు జిల్లా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జమాల్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా కాళియమ్మన్ ఆలయ రథోత్సవం

● పోటెత్తిన భక్తజనం

వేలూరు, మార్చి14(ఆంధ్రజ్యోతి):వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని కాళియమ్మన్ ఆలయరథోత్సవం శుక్రవారం ఉదయం వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల దివ్యనామ స్మరణల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు ముఖ్యఅతిథిగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. యూనియన్ కమిటీ అధ్యక్షుడు అముదా లింగం, కోశాధికారి లింగం, యువజన విభాగం వైస్ ఆర్గనైజర్ సతీష్, గ్రామపెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతం ఎమ్మెల్యే అమ్ములు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిధుల సమీకరణలో రాంగ్సన్స్ ఏరోస్పేస్

అడయార్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని రాంగ్సన్స్ ఏరోస్పేస్ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ రంగా అన్నారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరోస్పేస్ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌కనుగుణంగా కార్యకలాపాలను విస్తరించేందుకు, వ్యూహాత్మక వృద్ధి సాధించేందుకు వీలుగా రూ.300 కోట్లను సమీకరించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. వాల్యూక్వెస్ట్ నుంచి నిధుల సేకరణ పట్ల సంతోషిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ చర్య మా విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడానికి, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో 'ఇళయరాజా సంగీత' వేడుకలు



● సీఎం స్టాలిన్ వెల్లడి

'ఇసైజ్ఞాని' ఇళయరాజా 50 యేళ్ళ సంగీత సినీ ప్రయాణాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక వేడుకలా నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'లండన్ నగరంలో సింఫోనీ అరంగేట్రాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగివచ్చిన సంగీత దర్శకుడు ఇళయరాజా సీఎంను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అర్ధ శతాబ్దపు సినీ సంగీత ప్రయాణాన్ని ప్రభుత్వం ఒక వేడుకగా నిర్వహించాలని నిర్ణయించాం. ఇళయారాజా సంగీత సామ్రాజ్యంలో ఓలలాడుతున్న సినీ అభిమానుల భాగస్వామ్యంతో ఈ వేడుకను విజయవంతంగా నిర్వహిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, ఇళయరాజా ఇటీవల లండన్ వెళ్ళేముందు ఇళయరాజా స్టూడియోకు ముఖ్యమంత్రి స్టాలిన్ వెళ్ళి అభినందించిన విషయం తెల్సిందే. ఇదిలావుంగే, గురువారం రాత్రి నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఇళయరాజా మాట్లాడుతూ, సంగీత అభిమానులు, మీడియా మిత్రుల కారణంగానే తాను సింఫోనీ అరంగేట్రం చేసే స్థాయికి చేరున్నానని, మీరు లేకపోతే తాను లేనని వ్యాఖ్యానించారు.

'విడాముయర్చి' కలెక్షన్ రికార్డు గల్లంతు


'డ్రాగన్' మూవీలో ఓ దృశ్యం

ఈ యేడాది ఇప్పటివరకు విడుదలైన చిత్రాల్లో అగ్రహీరో అజిత్ కుమార్ నటించిన 'విడాముయర్చి' చిత్రం సాధించిన అత్యధిక వసూళ్ల రికార్డు గల్లంతైంది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన 'డ్రాగన్' సినిమా 'విడాముయర్చి' రికార్డు కలెక్షన్లను అధిగమించి 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన తొలి చిత్రంగా నిలిచింది. 'విడాముయర్చి' మూవీ ఫిబ్రవరి 7న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలైంది. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా తొలి మూడు రోజుల్లోనే భారీ కలెక్షన్లు రాబట్టింది. అయితే, ఈ మూవీ నిర్మాణం కోసం వెచ్చించిన ఖర్చుతో పోల్చితే ఈ వసూళ్ళు ఆశించిన మేరకు లేవన్నది సినీ ట్రేడ్ వర్గాల సమాచారం. ఇపుడు అజిత్ చిత్రం మొత్త కలెక్షన్లను డ్రాగన్ మూవీ అధిగమించింది. దీంతే మేకర్స్‌తో పాటు చిత్ర బృందం ఆనందంలో మునిగితేలుతున్నారు. కేవలం రూ.37 కోట్లతో ఏజీఎస్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించగా, రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ జంటగా నటించగా, మిష్కిన్, గౌతం వాసుదేవ్ మేనన్ తదితరులు నటించారు.

దర్శకత్వం వైపు రవి మోహన్ మొగ్గు!


యోగిబాబు, రవి మోహన్

హీరో రవి మోహన్ (జయం రవి) దర్శకత్వం వైపు మొగ్గు చూపారు. ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు హీరోగా హాస్యభరిత చిత్రాన్ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేశారు. ఈ చిత్రాన్ని తన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందించనున్నారు. ఈ విషయంపై త్వరలో ఆయన అధికారికంగా వెల్లడించనున్నారు. ఇటీవల తన భార్యకు విడాకులు ఇస్తున్నట్టు ప్రకటించిన జయం రవి.. ఆ తర్వాత తన పేరు రవి మోహన్‌గా మార్చుకున్నారు. అప్పటి నుంచి ఆయన తాను నటించే సినిమా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించారు. మరోవైపు, తనకిష్టమైన దర్శకత్వ బాధ్యతలను చేపట్టాలని ఆయన ఉవ్విళ్ళూరుతున్నారు. ప్రస్తుతం రవి మోహన్ 'పరాశక్తి', 'కరాటే బాబు' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు పూర్తి చేసిన తర్వాత ఆయన దర్శకత్వం చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ విషయాన్ని ఆయన పలు ఇంటర్వ్యూల్లో కూడా వెల్లడించారు.

తమిళ చిత్రజ్యోతి

సినిమాపై వివక్ష తగదు



● జ్యోతిక

సినిమా లేదా హీరో పట్ల వివక్ష ఏమాత్రం తగదని సినీ నటి జ్యోతిక వ్యాఖ్యానించారు. తన భర్త, హీరో సూర్య నటించిన 'కంగువా' చిత్రానికి రివ్యూలు చెత్త సినిమాల కంటే దారుణంగా ఇచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన ఆమె ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నా భర్త సూర్య నటించిన 'కంగువా' చిత్రంలో కొన్ని భాగాలు మాత్రమే బాగాలేకపోవచ్చు. కానీ, ఓవరాల్‌గా ఆ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. అయితే, ఈ మూవీకి చెత్త సినిమాల కంటే దారుణమైన రివ్యూలు ఇచ్చారు. ఇది నన్ను ఎంతగానో మనోవేదనకు గురిచేసింది. ఒక సినిమా లేదా హీరో పట్ల వివక్ష చూపడం బాధగా ఉంది. బాక్సాఫీస్ వద్ద చాలా తక్కువ క్వాలిటీ చిత్రాలు వచ్చాయి. అవన్నీ కమర్షియల్‌గా విమర్శలకు నోచుకున్నాయి. కానీ, నా భర్త చిత్రం మాత్రం దారుణమైన రివ్యూలను ఎదుర్కొంది' అని జ్యోతిక వాపోయారు.

మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గృహనిర్మాణ సంస్థల ద్వారా నిరుపేదలకు కాంక్రీటు నివాసాలు, క్వార్టర్స్ నిర్మించి ఇచ్చారని, ప్రస్తుతం ఆయన పేరుతో అమలు చేస్తున్న గృహనిర్మాణ పథకం కింద రూ.3500 కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరంలోగా లక్ష గృహాలను నిర్మించి ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. శుక్రవారం ఉదయం అసెంబ్లీలో బడ్జెట్ దాఖలు చేసిన ఆయన.. భూములులేని పేద కుటుంబాలకు చెందిన 5లక్షల మందికి ఇంటినివేశన పట్టాలు మంజూరు చేస్తామన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

● 45 భాషల్లో తిరుక్కురళ్
● బడ్జెట్ దాఖలు చేసిన తంగం తెన్నరసు



గుడిసెలు లేని రాష్ట్రంగా

తమిళనాడు


బడ్జెజ్‌ను ప్రవేశపెట్టడానికి ముందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆశీస్సులందుకుంటున్న ఆర్థికమంత్రి తంగం తెన్నరసు, ఆర్థికశాఖ కార్యదర్శులు

ఏ శాఖకు ఎన్ని కోట్ల నిధులంటే..?

చెన్నై, ఆంధ్రజ్యోతి

- ఉన్నత విద్యాశాఖకు రూ.8494 కోట్లు
- పాఠశాలల విద్యాశాఖకు రూ.46,767 కోట్లు
- నగరాభివృద్ధి శాఖకు రూ.25వేల కోట్లు
- యువజన సంక్షేమం, క్రీడాశాఖలకు రూ.572 కోట్లు
- కార్మిక సంక్షేమం, ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖకు రూ.1975 కోట్లు
- వైద్య, ప్రజారోగ్య శాఖలకు రూ.21,906 కోట్లు
- పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలకు రూ.5833 కోట్లు
- ఆదిద్రావిడులు గిరిజనుల సంక్షేమ శాఖకు రూ.3924
- పురట్చితలైవర్ ఎంజీఆర్ పౌష్టికాహార పథకానికిరూ.2602 కోట్లు.
- చెన్నై మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టుకు రూ.4807 కోట్లు
- సింగార చెన్నై 2.0పథకానికి రూ.850 కోట్లు
- సమాచార సాంకేతిక శాఖకు రూ.131 కోట్లు
- అంతరిక్ష సాంకేతికాభివృద్ధి శాఖకు రూ.10 కోట్లు
- దివ్యాంగుల సంక్షేమ శాఖకు రూ.1433 కోట్లు
- చేనేత శాఖకు రూ.1980 కోట్లు
- గృహ వసతి శాఖకు రూ.7718 కోట్లు
- రహదారుల శాఖకు రూ.20722 కోట్లు
- ప్రజాపనుల శాఖకు రూ.2457 కోట్లు
- ఇంధనశాఖకు రూ.21,178 కోట్లు
- రవాణా శాఖకు రూ.12,965 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.27,168 కోట్లు
- పోలీసు శాఖకు రూ. 13,342 కోట్లు
- సాంఘిక సంక్షేమ శాఖకు రూ.8597కోట్లు.

బడ్జెట్ ఆర్థికాంశాలు...

ఈ బడ్జెట్‌లో మంత్రి తంగం తెన్నరసు పన్నులు ఇతర రూపాల్లో ప్రభుత్వానికి రానున్న అంచనా రాబడి రూ.3,31,569 కోట్లుగా , అంచనా వ్యయం రూ.3,73,204 కోట్లుగా చూపెట్టారు. బడ్జెట్ లోటు రూ.41,635 కోట్లని ఆయన తెలిపారు. ఈ వ్యయంలో వేతనాలకు రూ.90,464 కోట్లు, నిర్వహణ ఖర్చులకు రూ.16,972 కోట్లు, సబ్సిడీలు గ్రాంట్లకు రూ.1,53,724 కోట్లు, పింఛన్, రిటైర్మెంట్ చెల్లింపులకు రూ.41,200 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.70,754 కోట్లు చొప్పున కేటాయిస్తున్నట్లు తెలిపారు. పన్నుల రూపేణా రాష్ట్ర రాబడి రూ.2,20,895 కోట్లుగాను, పన్నుల రహిత రాష్ట్ర రాబడి రూ.28,818 కోట్లుగా పేర్కొన్నారు. కేంద్రం నుండి విడుదల కావాల్సిన నిధులు రూ.23,834 కోట్లుగా, కేంద్ర పన్నుల వాటా రూ.58,022 కోట్లున్నాయని, 2025-26లో ప్రభుత్వ సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయం 14.6 శాతం పెరుగుతుందని అంచనా వేశారు.


బడ్జెట్‌ను దాఖలు చేయడానికి అసెంబ్లీకి వెళుతూ మెరీనాబీచ్‌లోని అన్నా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తంగం తెన్నరసు

రూపాయి రాక..

ఈ బడ్జెట్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిధులను ఏ విధంగా సమకూర్చుకుని వ్యయమొనర్చుతుందో మంత్రి తంగం తెన్నరసు వివరించారు. ఆ మేరకు ప్రభుత్వానికి రూపాయి రాబడి ఎలా వస్తుందో అదే విధంగా ఆ రూపాయి ఎలా వ్యయమవుతోంది తెలిపారు. మంత్రి అందించిన వివరాల ప్రకారం 31.4 శాతం రుణాల ద్వారా, 45.6 శాతం రాష్ట్ర స్వీయ పన్నుల రూపంలో, 0.2 శాతం రుణాల రికవరీ, పెట్టుబడి చెల్లింపుల రూపంలోను, 4.9 శాతం కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలోను, 5.9 శాతం రాష్ట్ర ప్రభుత్వ పన్నుల రహిత రెవెన్యూగా, 12 శాతం కేంద్ర పన్నుల వాటా రూపంలోనే ప్రభుత్వానికి ఓ రూపాయి రాబడిగా వస్తుంది.

రూపాయి పోక..

ఇదే విధంగా 31.6 శాతం సబ్సిడీలు, గ్రాంట్ల రూపంలో, 14.5 శాతం చొప్పున ప్రభుత్వం రుణాలకు చెల్లించాల్సిన వడ్డీ కింద, 18.6 శాతాన్ని వేతనాలకు, 11.8 శాతాన్ని పెట్టుబడి వ్యయంగా, 9.7 శాతం రుణాల చెల్లింపుగా, 3.5 శాతాన్ని నిర్వహణ తదితరాలకుగాను ఒక రూపాయిని ఖర్చు చేయాల్సి ఉంటుంది.

బడ్జెట్‌లో విశేషాలు...

చెన్నై, ఆంధ్రజ్యోతి

- వేళచ్చేరి మెయిన్‌రోడ్డు నుండి గురునానక్ కాలేజీ వరకు రూ.310 కోట్ల తో ఫ్లైఓవర్ నిర్మాణం
- మదురై, కడలూరులో రూ.250 కోట్లతో పాదరక్షల తయారీ పారిశ్రామికవాడలు
- డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై డిప్లొమా కోర్సులు
- రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి రూ.300 కోట్లు ● నీలగిరి, కున్నూరు, చెన్నై (ఆలందూరు) సహా 8 జిల్లాల్లో ఆర్ట్స్ కళాశాలలు
- 2025-26లో లక్షమంది విద్యార్థులకు రూ.2500 కోట్ల మేరకు విద్యారుణాలు
- చెన్నై, కోవైలో రూ.100 కోట్లతో వైజ్ఞానిక గణిత పరిశోధనా అధ్యయన కేంద్రాలు
- కార్పొరేషన్లలో 'ముదల్వర్ పడైప్పగం' (స్టడీ సెంటర్లు, వర్కింగ్‌స్పేస్‌లతో కూడిన కేంద్రాలు)
- పాఠ్యాంశాల్లో చదరంగంపై ప్రత్యేక పాఠ్యాంశం, ఆ దిశగా వ్యాయమబోధనలోనూ మార్పులు
- వెళ్ళిమలై, ఆళియారులో రూ.11.721 కోట్లతో జలవిద్యుత్ కేంద్రాలు
- తాంబరంలో చెత్త నుండి విద్యుదుత్పత్తి కేంద్రం
- 4వేల మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్
- తాంబరం నుండి గిండి వరకు, వేళచ్చేరి మీదుగా లైట్‌హౌస్ నుండి హైకోర్టు దాకా కొత్త మార్గంతో మూడో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పథకం
- రూ.150 కోట్లతో ప్రాచీన భవనాలకు కొత్త మెరుగులు
- ప్రాచీన దేవాలయాల మరమ్మతులకు రూ.10 కోట్లు
- ఈరోడ్ జిల్లాలో రూ.22 కోట్లతో నొయ్యల్ మ్యూజియం
- వరల్డ్ తమిళ్ ఒలింపియాడ్ నిర్వహణ, విజేతకు రూ.కోటి బహుమతి
- చెన్నై కార్పొరేషన్ పరిధిలో రూ.88 కోట్లతో వాననీటిని పీల్చే స్పాంజ్ పార్కులు
- సముద్ర సంపద సంరక్షణ వ్యవస్థకు రూ.50 కోట్లు
- ఊటీ రేస్‌కోర్సు ప్రాంతంలో రూ.70 కోట్లతో ఎకో టూరిస్టు పార్కు
- బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్లు పొందేలా తిరువాన్మియూరు, పాలవాక్కం, ఉత్తండి, కులశేఖరపట్టినం, కీళ్పుదుపట్టు, సామియార్‌పేట బీచ్‌ల స్థాయి పెంపు
- రూ.కోటితో వేట పక్షుల పరిశోధన కేంద్రం
- ధనుష్కోటి వద్ద ఫ్లెమింగో పక్షుల శరణాలయం
- ప్రభుత్వ ఉద్యోగులకు మళ్ళీ (15 రోజులవరకు) సరెండర్ లీవు నదుపాయం
- రూ. 120 కోట్లతో కాంచీపురంలోని ప్రభుత్వ క్యాన్సర్ చికిత్సా కేంద్రం స్థాయి పెంపు
- ఈ యేడాదిలోగా 40వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- సింగపూరు, దుబాయ్, మలేసియాలో తమిళ పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి రూ.2 కోట్లు
- ఎగ్మూరు మ్యూజియంలో పంచలోహాలు, రాగిలోహంతో తయారైన రూపాలతో ప్రదర్శనశాల.

45 భాషల్లో తిరుక్కురళ్..

రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానమే అమలులో ఉండటంతో తమిళులంతా ఏ దేశంలో ఉన్నా తిరువళ్లువర్ తిరుక్కురళ్ పఠనంపై ఆసక్తి కలిగి ఉంటున్నారని, ఈ దిశగానే మరో 45 భాషల్లో తిరుక్కురళ్‌ను అనువాదం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీలయినంత త్వరగా 193 భాషల్లో తిరుక్కురళ్‌ను అనువాదం చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ప్రాచీన తాళ పత్రాల డిజిటలైజేషన్‌కు రూ.2 కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

అనాథ చిన్నారులకు ప్రతినెలా రూ.2 వేలు

రాష్ట్రంలో తల్లిదండ్రులు లేక, బంధువులు, ఇతరుల సంరక్షణలో ఉన్న చిన్నారులకు 'తాయుమానవర్ పథకం' అమలు చేయనున్నామని తెలిపారు. ఆ ప్రకారం అటువంటి 50 వేలమంది చిన్నారులకు 18 ఏళ్లు వచ్చినంత వరకు ప్రతి నెలా రూ.2వేల సాయం అందిస్తామని, ఆ నగదు వారి చదువులకు సద్వినియోగమవుతుందన్నారు.

నగరాల్లో బడిపిల్లల అల్పాహార పథకం..

రాజధాని నగరం చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుండి ఐదో తరగతి వరకు బడిపిల్లలకు ఉదయం పూట అందిస్తున్న అల్పాహార పథకాన్ని రాష్ట్రంలోని అన్ని నగరాలకు విస్తరింపజేయనున్నట్లు ఆయన తెలిపారు.

కాలేజీ విద్యార్థులకు ఉచిత లాప్‌టాప్‌లు...

ఈ విద్యా సంవత్సరం కాలేజీ విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు లేదా లాప్‌టాప్‌లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ పథకం అమలుకు రూ.2వేల కోట్లను కేటాయిస్తున్నట్లు చెప్పారు.

మరో 800 'తోళి' వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు

మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలో 10 చోట్ల రూ.77 కోట్లతో 'తోళి' పేరిట వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అదేవిధంగా మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చే మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ బడ్జెట్‌లో రూ.37 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మహిళల వెలుగుబాట ప్రయాణ పథకానికి రూ.3600 కోట్లు కేటాయిస్తామన్నారు. ఇక పదిలక్షల విలువైన ఆస్తులను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే 1 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గిస్తామన్నారు. ఈ యేడాది అర్హులైన గృహిణులకు కలైంజర్ సాధికారిక నగదు పథకాన్ని విస్తరింపజేస్తామన్నారు.

హిజ్రాలకు పుదుమైపెణ్ పథకం...

పుదుమైపెణ్, తమిళ్‌పుదల్వన్ పథకాలను హిజ్రాలకు కూడా విస్తరింపజేయనున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో సీనియర్ సిటిజన్ల సంరక్షణకు 'అన్బుచోలై' పేరిట వృద్ధాశ్రమాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయనుందన్నారు.

రూ.366కోట్లతో 9 పారిశ్రామికవాడలు...

ఈ యేడాది రూ.366 కోట్లతో 9 పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో సెమికండెక్టర్ల ఉత్పత్తి కర్మాగారాలు, కోయంబత్తూరు సమీపం సూలు, పల్లడం వద్ద తలా 100 ఎకరాల విస్తీర్ణంలో సెమికండక్టర్ల మిషనరీ ఇండస్ట్రియల్ పార్కు, హోసూరులో రూ.400 కోట్లతో టైడల్ టెక్నికల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.

రామేశ్వరంలో కొత్త ఎయిర్‌పోర్ట్...

సుప్రసిద్ధ ఆధ్యాత్మిక నగరం రామేశ్వరంలో కొత్త విమానాశ్రయం నిర్మించేందుకు చర్యలు చేపడతామని మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. ఆ దిశగా కేంద్ర విమానయాన సంస్థ అధికారులతో త్వరలో చర్చలు జరుపుతామని చెప్పారు. గిండి, వాషర్‌మెన్‌పేటలో మల్టీపర్పస్ బస్‌టెర్మినళ్ల ఏర్పాటుకు రూ.50 కోట్లు కేటాయిస్తున్నామని, తిరువాన్మియూరు - ఉత్తాండి మధ్య ఫోర్‌వే రహదారి నిర్మాణానికి రూ.2100 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

3 నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులు..

రాష్ట్ర రవాణా సంస్థకు సంబంధించి డీజిల్‌తో నడుస్తున్న బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చేందుకు రూ.70 కోట్ల మేర కేటాయిస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో 905 ఎలక్ట్రిక్ బస్సులు, మదురైలో 100 ఎలక్ట్రిక్ బస్సులు, కోవైలో 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుపున్నామని, ఆ మేరకు త్వరలోనే 1125 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తామన్నారు.

అంతర్జాతీయ స్థాయికి అన్నావర్సిటీ...

స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయాన్ని ఆసియాలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని, ఆ మేరకు రూ.500 కోట్ల మేరకు నిధులు కూడా కేటాయిస్తున్నామని తెలిపారు. ఇక విద్యాశాఖకు సంబంధించి 800 ఉన్నతస్థాయి సాంకేతిక పరిశోధన కేంద్రాలను రూ.56 కోట్లతో కొత్త సదుపాయాలతో పునర్నించనున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను రూ.700 కోట్లకు పెంచుతున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2676 పాఠశాలల్లో రూ.65 కోట్లతో తరగతి గదులను మెరుగుపరచనున్నామని చెప్పారు.

విల్లుపురం, వేలూరుకు హైస్పీడ్ రైలు..

ఢిల్లీ - మీరట్ నగరాల మధ్య ప్రస్తుతం నడుపుతున్న హైస్పీడు రైలును చెన్నై నుంచి ప్రముఖ నగరాలకు నడిపే యోచన ప్రభుత్వానికి ఉందని మంత్రి తంగం తెన్నరసు చెప్పారు. ఆ ప్రకారం చెన్నై నుంచి చెంగల్పట్టు దిండివనం మీదుగా విల్లుపురానికి, చెన్నై నుండి కాంచీపురం మీదుగా వేలూరు, కోయంబత్తూరు నుండి తిరుప్పూరు, ఈరోడ్ మీదుగా సేలం నగరానికి గంటలకు 160 కి.మీల వేగంతో నడిచే రైలు సర్వీసులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఆ దిశగా మెట్రోరైలు సంస్థ ఈ పథకం సాధ్యాసాధ్యాలపై నివేదికను రూపొందించే పనుల్లో ఉందన్నారు.



రంగుల కేళి... హోలీ..
యువత ఉత్సాహం...

● నగరంలో కోలాహలం

ప్యారీస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీని శుక్రవారం రాష్ట్రమంతటా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రాజధాని నగరం చెన్నైలో ఉత్తర భారతీయులు, గుజరాతీలు, మార్వాడీలు, వ్యాపారులు హోలీ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని షావుకారుపేట, జార్జిటౌన్, పార్క్‌టౌన్ ప్రాంతాల్లో డీజే పాటలకు నృత్యాలు చేస్తూ, యువతీ యువకులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. హోలీ పండుగ ఐక్యమత్యానికి అన్నదమ్ముల ఆత్మీయ భావాలకు కూడా ప్రతీకైన ఈ రోజు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. తమ బంధువులు తమ స్నేహితులు కలిసి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ హోలీ వేడుకల్లో మునిగితేలారు. ఉత్తర భారతీయులతో పాటు స్థానికులు కూడా రంగులు పూసుకుంటూ ప్రత్యేకమైన వంటలతో హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. నగరంలో పలుప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగాల్లో స్థిరపడిన ఉత్తర భారతీయులు సర్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచే ఫాల్గుణ పూర్ణిమను హోలీ పూర్ణిమగా జరుపుకున్నారు. గురువారం రాత్రి వారు నివసిస్తున్న ప్రాంతాల్లో కామదహనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర పర్యావరణ శాఖ సూచనల మేరకు రసాయనాలతో తయారుచేసిన రంగులు వాడకుండా, ప్రకృతిలో సహజంగా వుండే రంగులు ఒకరిపై ఒకరు చల్లుకుని సంప్రదాయాలకు అద్దంపట్టారు.





మెరీనాలో వేడుకగా మాసి మఖం తీర్థవారి

పెరంబూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో మాసి మఖం తీర్థవారి ఉత్సవాలు వేడుకగా సాగాయి. మాసి పౌర్ణమి రోజైన శుక్రవారం ట్రిప్లికేన్ పార్థసారథి పెరుమాళ్, మైలాపూర్ కపాలీశ్వరస్వామి, వెళ్ళీశ్వరస్వామి, విరుపాక్షేశ్వర స్వామి తదితర ఆలయాల నుంచి ఉత్సవమూర్తులను పల్లకీల్లో ఊరేగింపుగా మెరీనా తీరానికి తీసుకొచ్చి తీర్థవారి నిర్వహించారు.


పల్లకీలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న దృశ్యం



తిరుమలతో సంయుక్తా మీనన్

హీరోయిన్ సంయుక్తా మీనన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రెండుమూడు సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబరులో 'అఖండ 2' విడుదల కానుందన్నారు. 'స్వయంభూ' కూడా విడుదలకు సిద్ధంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సన్నటి పామే కానీ డేంజర్!

చాకచక్యంగా పట్టుకున్న భాస్కర్‌నాయుడు

పాము సన్నటిదే కానీ అత్యంత విషపూరితం. శుక్రవారం నాడు తిరుమల బాలాజీ నగర్‌లో ఒక బైక్‌లోకి ఎక్కేసింది. గమనించిన స్థానికులు భాస్కర్‌నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఐదు అడుగులు పొడవున్న తాటికట్ల పామును ఆయన పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీఎన్ భట్టి



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ లక్ష్మణ్‌రావు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ కూడా వేరువేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు స్లీపింగ్ డే



రాత్రంగా నిద్ర లేదు..మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.. తెల్లవారుజామున రెండు గంటలు నిద్రపోయానంతే..

..కంటి నిండా నిద్రపోయి చాన్నాళ్లయింది.. ఏమయ్యిందో ఏంటో..

ఈమధ్య మాత్ర వేసుకున్నా నిద్ర పట్టడం లేదు..

ఇలాంటి మాటలు చాలామంది నుంచి తరచూ వింటుంటాం. ఇటీవల కాలంలో నిద్రలేమితో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువైంది. వయసుతో సంబంధం లేకుండా 80 శాతం మంది అనారోగ్య సమస్యలకు కారణం సరైన నిద్ర లేకపోవడమేనంటున్నారు వైద్యనిపుణులు. సగటున రోజుకు ఏడు గంటల సేపు నిద్ర పోకున్నా, సక్రమంగా నిద్ర పట్టడం లేదన్నా అనారోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారని సంకేతమంటున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నిద్రపోకుండా ఇలా సెల్‌ఫోన్ చూడటం ప్రమాదకరం

కునుకే బంగారమాయెనె..

- పెరుగుతున్న నిద్రలేమి బాధితులు
- ఒత్తిళ్లు, నిరంతర ఆలోచనలతో సతమతం
- అదేపనిగా మొబైల్ ఫోన్ చూడటమూ కారణమే
- నిద్ర దూరమైతే అనారోగ్యం దగ్గరవుతున్నట్టే

ప్రస్తుత రోజుల్లో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. వివిధ సమస్యలతో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న చాలామంది కంటి నిండా కునుకు తీయలేకపోతున్నారు. మంచం ఎక్కినా నిరంతర ఆలోచనలతో నిద్రకు దూరమవుతున్నారు. ఈతరహా బాధితులు పెరుగుతున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న రోగుల్లో వీరి సంఖ్య పెరుగుతోందంటున్నారు. దీనికితోడు అన్ని వర్గాల వారూ మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతున్నారు. క్షణం ఖాళీ దొరికినా సెల్ చూస్తున్నారు. రాత్రివేళ కూడా దీంతోనే కాలక్షేపంతో చేస్తున్నారు. పగటి పూట కొంత పర్వా లేదు గాని రాత్రిళ్లు దీని ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్రపోయే ముందు కళ్లు తీవ్ర ఒత్తిడికి గురైతే సక్రమంగా నిద్ర పట్టదు. చీకట్లో సెల్‌ఫోను చూడటం వల్ల ఆ ప్రభావం మూడింతలవుతోంది. దీంతో కళ్ల కింద నలుపు, వాపు పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర తక్కువైతే జ్ఞాపక శక్తి తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నిద్ర తక్కువైతే ప్రమాదం



నిద్ర పిల్లలకు, పెద్దలకు ఎంతో అవసరం. ఆరోగ్యంలో దీని ప్రభావం చాలా ఎక్కువ. పదేళ్ల లోపు చిన్నారులు రోజుకు 8-10 గంటలు నిద్రపోవాలి. లేదంటే ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చిన్నతనంలోనే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రమంగా జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. రాత్రిళ్లు సెల్‌ఫోన్లు ఇవ్వడం వలన నిద్ర తక్కువై ఆ ప్రభావం మొదట్లోనే కళ్లపైనే చూపుతుంది. తరువాత ఊబకాయం, చర్మవ్యాధులు, నరాల సమస్యలు తలెత్తుతాయి. పెద్దలకు కూడా రోజుకు ఏడు గంటల నిద్ర లేకపోతే శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండె జబ్బు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి తగ్గడం, రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతినడం, దీర్ఘకాలిక వ్యాధులకు దగ్గరవుతారని పరిశోధనలు కూడా చెబుతున్నాయి.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

సుఖ నిద్రకు ఇలా చేస్తే మంచిది



మానసిక సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారిలో చాలా మంది నిద్ర సక్రమంగా పట్టనివారే. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మానసిక దృఢత్వానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రకు 2-3 గంటల ముందు భోజనం ముగించాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పాలు, తక్కువ కొవ్వు ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు కెఫిన్, ఆల్కాహాల్‌ను నివారించాలి. సెల్‌ఫోన్లు, టీవీలను చూడకూడదు. పడుకునే గది చల్లగా, ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోవాలి. బెడ్ మీదకు చేరాక కాస్సేపు పుస్తకాలు చదవడం, స్నానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం చేయాలి. ఆరోజు జరిగినవన్నీ పడుకునేముందు మననం చేసుకోకూడదు. పడుకున్న 20 నిముషాలకూ నిద్రరాకపోతే అరు బయటకు వెళ్లి విశ్రాంతినిచ్చే చిన్నపనులు చేస్తే నిద్ర పడుతుంది.

- డాక్టర్ మానస, మానసిక వైద్య నిపుణురాలు, రుయాస్పత్రి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టు మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,148
తలనీలాలు సమర్పించినవారు: 21,236

ప్రాణం తీసిన వేగం

- ఆగివున్న లారీని ఢీకొన్న బైక్.. హోసూరు యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ ఆగివున్న లారీని ఢీకొనడంతో హోసూరు పట్టణానికి చెందిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు... తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు పట్టణానికి చెందిన అప్పునూ, భారతి దంపతుల కుమారుడు ప్రదీప్ అప్పునూ(27) జర్మనీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. హోసూరు పట్టణంలో ప్రదీప్ ఇంజినీరింగ్ కంపెనీ పేరుతో పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. జర్మనీలో తనతో పాటు ఇంజనీరింగ్ చదివిన స్నేహితుడి వివాహం శుక్రవారం రాత్రి విజయవాడలో జరుగనుంది. మిత్రుడి వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు బజాజ్ 400సీసీ బైక్‌పై హోసూరు నుంచి విజయవాడకు బయలుదేరాడు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వేగంగా ఢీకొని డివైడర్‌కు అమర్చిన ఇనుప చువ్వలకు మధ్యలో ఇరుక్కుపోయిన ప్రదీప్ అప్పునూ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రదీప్ అప్పునూ మృతదేహన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, హెల్మెట్ ధరించి ఉన్నా తలకు తీవ్ర గాయాలై మృతి చెందడంతో బైక్ వేగాన్ని అంచనా వేయలేకపోతున్నట్లు ఎస్ఐ నాగరాజు చెప్పారు.



ప్రదీప్ అప్పూ (ఫైల్‌ఫోటో) -



లారీ, ఇనుప ఊచల మధ్య ఇరుక్కు పోయిన బైక్



సభ వద్ద నాగాబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనఘోష

పవనుడు అందరివాడు..





పవన్ అభిమానం

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

చిత్రాడదారులన్నీ జనపవనమై..

